క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టరేట్‌లో శుక్రవారం మండల పంచాయతీ అధికారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ, అదనపు కలెక్టర్ హేమంత్ బొర్కడే ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రత్నాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి అజీజ్, గోవర్ధన్, మోజాం, శ్రీనివాస్‌గౌడ్, అమీర్ ఖాన్ సభ్యులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

లక్ష్మణచాంద: సోన్ మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందిన గొడుగు సాయన్న గురువారం మృతి చెందారు. బాధిత కుటుంబానికి ఎఫ్ఎస్‌సీఎస్(రైతుసేవా సహకార సంఘం) డైరెక్టర్ తోట సాయన్న శుక్రవారం రూ.50వేల విలువైన బీమా చెక్కు అందించారు. కార్యక్రమంలో ఎఫ్ఎసీఎస్ డైరెక్టర్ తోట సాయన్న, పలువురు వీడీసీ సభ్యులు కిషన్, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిల్వనీటితోనే రోగాలు



నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది

లక్ష్మణచాంద: నిల్వనీటితో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతామని సర్పంచ్ శ్రీవిద్య పేర్కొన్నారు. మండలంలోని బాబాపూర్ గ్రామంలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. పలు వీధుల్లో ఇళ్ల వద్ద పాత్రలు, కుండీల్లో నిల్వ చేసిన నీటిని పారబోయించారు. కార్యక్రమంలో కార్యదర్శి సుధాకర్, అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు

ఖానాపూర్: పట్టణంలోని ఐదోవార్డు పరిధిలో శుక్రవారం కౌన్సిలర్ పరిమి లత ఆధ్వర్యంలో రోడ్లకు మరమ్మతులు చేయించారు. ఇంద్రనగర్ నుంచి టవర్స్‌కాలనీ వెళ్లే రోడ్డు, కరీం కాలనీలోని పలు రోడ్లపై పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి మొరం పోయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సురేశ్ తదితరులు ఉన్నారు.

స్కానర్, బయోమెట్రిక్ పరిశీలన

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పని చేసే అధికారులు, సిబ్బంది హాజరుపై బయోమెట్రిక్ స్కానర్‌ను, సీసీటీవీ ఫుటేజీ నిర్వహణను మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బయోమెట్రిక్ స్కానర్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సిబ్బంది హాజరు పర్యవేక్షణలో భాగంగా బయోమెట్రిక్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు, జవాన్ మానాల శంకర్, తదితరులు ఉన్నారు.


పెద్దమనసు చాటుకున్న వ్యాపారులు



ప్రత్యేకంగా తయారు చేయించిన ట్రాలీ

సారంగాపూర్: సొంత ఊరికి వైకుంఠరథం ట్రాలీలు అందించి పెద్దమనసు చాటుకున్నారు మండలంలోని జామ్‌కు చెందిన ఇద్దరు వ్యాపారులు. స్టోన్ డెవలపర్స్ సంస్థ ప్రతినిధులు, జామ్ గ్రామస్తులు రామకృష్ణ, వెంకటనర్సయ్య(బుజ్జన్న) అనే వాపారులు తమ గ్రామానికి రెండు స్వర్గలోక(వైకుంఠరథం) ట్రాలీలను శుక్రవారం విరాళంగా అందజేశారు. ప్రభుత్వం పంచాయతీకి పంపిణీ చేసిన ట్రాక్టర్‌ను దృష్టిలో ఉంచుకుని వాటికి అనుగుణంగా జామ్‌లోనే ఉన్న చిన్నూరు, పెద్దూరుకు రెండు సుమారు రూ.మూడున్నర లక్షల విలువైన ట్రాలీలను అందించారు. వీడీసీ సభ్యులు, ఇన్‌చార్జి సర్పంచ్ విలాస్, రాజేశ్వర్ ఉన్నారు.

సినిమాలు



తిరుమల : వీరసింహారెడ్డి
నారాయణ : తెగింపు
వెంకటేష్ : వాల్తేరు వీరయ్య

- నిర్మల్‌టౌన్

నిర్వాసితుల ఎదురుచూపు

- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విడుదల చేస్తూ జీవో జారీ
- గుండెగాంలో పూర్తయిన అధికారుల సర్వే



గుండెగాంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు



గుండేగాం గ్రామ ముఖచిత్రం

భైంసారూరల్: ఎన్నో ఏళ్లుగా నీట మునుగుతున్న మండలంలోని గుండేగాం గ్రామానికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.61.30 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం గత నెలలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సైతం గ్రామంలో సర్వే నిర్వహించారు. కుటుంబాలు, జనావాసాలు, ఓపెన్‌ప్లాట్లు, ప్రజల జీవన స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని నివేదికలు తయారు చేశారు. వేర్వేరుగా అధికారుల బృందం జరిపిన సర్వే నివేదికల వివరాలను ఉన్నతాధికారులకు పంపించారు. గుండేగాం గ్రామంలో 271 కుటుంబాలు ఉన్నట్లు లెక్కతేల్చారు. గ్రామంలో 16521.74 యార్డుల విస్తీర్ణంలో నివాసగృహాలు, 15719.74 యార్డుల్లో ఓపెన్‌ప్లాట్లు ఉన్నట్లు అధికారులు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు.

ఆరేళ్లుగా నీట మునుగుతూ..

పల్సికర్ రంగారావు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో గుండేగాం గ్రామం ఆరేళ్లుగా నీట మునుగుతుండటంతో ఇప్పటికే కొన్ని కుటుంబాలు ఉపాధి కోసం వేరే చోటకు వెళ్లిపోయాయి. ఇటీవల సర్వే జరిపినప్పుడు చాలా మంది గ్రామంలో లేరు. ఐదేళ్లుగా గ్రామంలోకి నీరురావడం.. ఊరంతా నీటమునుగడం, భయం గుప్పిట్లో బతుకులు వెళ్లదీయగా చాలా మంది ఇతర ప్రాంతాల్లో జీవనోపాధి పొందుతున్నారు. అధికారులు తమ వివరాలు కూడా నమోదు చేసుకొని ప్యాకేజీ అందించాలని కోరుతున్నారు.

బ్యాక్‌వాటర్ ఎక్కువగా రావడంతో మంత్రి, ఉన్నతాధికారుల ఆదేశాలకు రెండేళ్ల కిందట గ్రామంలోని వంద కుటుంబాలు కమలాపూర్ గుట్ట సమీపంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు వెళ్లిపోయారు. వారంతా తాత్కాలికంగా అక్కడే ఉంటున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఇబ్బంది పడేకన్నా తాత్కాలికంగా అక్కడే ఉంటూ రైతులు, కూలీలు రోజు గ్రామానికి వెళ్లి వస్తున్నారు. మరో 150 కుటుంబాలు గుండేగాంలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా శాశ్వత పరిష్కారం కోసమే ఎదురుచూస్తున్నారు.

పరిహారం మంజూరైతే..

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఉత్తర్వుల ఆధారంగా పరిహారం త్వరగా మంజూరు చేయాలని గుండేగాం వాసులు కోరుతున్నారు. పల్సికర్ రంగారావు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో మునుగుతున్న ఈ గ్రామాన్ని పూర్తిగా ఆదుకోవాలని విన్నవిస్తున్నారు. పునరావాసం కింద స్థలం ఎంపిక చేసి అందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. కొన్నేళ్లుగా తమకు పునరావాసం ఏర్పాటు చేయాలని గుండేగాంవాసులు పోరాటం చేస్తూనే ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సైతం గుండేగాంవాసుల కష్టాలను పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించారు. సీఎంకేసీఆర్‌తోపాటు రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలను వివరించారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం మంజూరు చేసి తమ కష్టాలు తీర్చాలని గుండేగాం వాసులు కోరుతున్నారు.

సర్వే నిర్వహించాం

గుండేగాం గ్రామంలో అధికారులు సర్వే నిర్వహించి 271 కుటుంబాలు ఉంటున్నట్లు గుర్తించారు. అక్కడి నివాస గృహాలు, ఓపెన్ ప్లాట్లు, ఇతర వివరాలన్నీ సేకరించాం. ఆ నివేదికలను ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పరిహారం అందేలా చూస్తాం.

– రవికుమార్, ఆర్డీవో, భైంసా

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం



భైంసాలో కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్తులు



ఖానాపూర్‌లో కల్యాణం తిలకిస్తున్న భక్తులు

భైంసాటౌన్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదారంగనాథస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల నేపథ్యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నెలరోజులుగా ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ వేడుక జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా అన్నదానం చేశారు.

కడెం: మండలంలోని ఎలగడప గ్రామంలో శుక్రవారం గోదా రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, శ్రీనివాసశర్మ కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తెమ్మ, ఉపసర్పంచ్ ఉమేశ్, గంగన్న, వీడీసీ చైర్మన్ రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.



భైంసాలో వేడుక తిలకిస్తున్న భక్తులు



ఎలగడపలో స్వామివార్లను తీసుకొస్తున్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో గోదాదేవి రంగనాథుల కల్యాణ మహోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిపించారు. అర్చకులు చక్రపాణి వాసుదేవాచార్యులు, నర్సింహమూర్తి, సందీప్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అడ్డగట్ల రాజన్న, కృష్ణంరాజు, తిరుపతి, శ్రీనివాస్, రాము, గంగనర్సయ్య, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

ఎక్కువ మందికి కంటి పరీక్షలు చేయించాలి

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18నుంచి చేపడుతున్న కంటివెలుగు కార్యక్రమంలో ఎక్కువ మందికి కంటి పరీక్షలు చేయాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ అధికారులు, మెప్మా, ఆరోగ్య సిబ్బందితో కంటివెలుగుపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి పరీక్షలు చేసుకునేలా చూడాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో కంటివెలుగును విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అరిగెల సంపత్‌కుమార్, డాక్టర్ మతిన్, రమణ, సుభాశ్ రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ పరిశీలన

జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ శివారు డంపింగ్ యార్డుకు గురువారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ శుక్రవారం ఉదయం అధికారులు, నాయకులతో కలిసి యార్డును పరిశీలించారు. ఈసందర్భంగా మహాలక్ష్మివాడ, అనంతపేట్, సీలాయిపేట్ గ్రామాల ప్రజలు దుర్వాసన, పొగతో శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన చైర్మన్ ఇలాంటి ఘటనలు జరగకుండా సెక్యూరిటీ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. వారి వెంట ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంపత్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

బిల్లులు విడుదల చేయాలి

పెంబి: మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.రెండు వేతనం అమలు చేయాలని కోరారు. అనంతరం మండలకేంద్రంలోని పీహెచ్‌సీ పరిధిలో ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మెడికల్ ఆఫీసర్ సుభాశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజనం మండల అధ్యక్షురాలు చీకటి లక్ష్మి, కార్యదర్శి లక్ష్మి, పోచవ్వ, తదితరులు ఉన్నారు.

అందుబాటులో యూరియా

లక్ష్మణచాంద: మండలంలోని ఆయా గ్రామాల రైతులకు సరిపడ యూరియా పీఏసీఎస్ కార్యాలయంలో అందుబాటులో ఉందని డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లతో రావాలని సూచించారు.

బాధిత కుటుంబానికి సాయం

ఖానాపూర్: పట్టణంలోని వాసవీమాత ఆలయంలో పని చేసే తారాబాయి మనుమడి కాలు ఆపరేషన్ నిమిత్తం స్థానిక ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో రూ.8700 జమచేసి వారికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జితేందర్, బుచ్చన్న, రాజేందర్, సుధాకర్, మాధవి, గీత, స్వరూప, మానస, వాసవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సంక్రాంతి

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల ఆర్యస్కూల్‌లో ఈనెల 14న రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ ఆధ్వర్యంలో మకర సంక్రాంతి ఉత్సవం ఉంటుందని ఆర్ఎస్ఎస్ నాయకులు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి వక్తగా జిల్లా ప్రచారక్ కె.భరత్, తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. పశువైద్యశాలను పట్టించుకోరూ



లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామంలో సిబ్బంది లేక ప్రాథమిక పశువైద్యశాల ఏడాదిగా తెరుచుకోవడం లేదు. ఇక్కడ పనిచేసిన వైద్యాధికారి బదిలీపై వెళ్లడంతో దీనిని పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో వైద్యశాల పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. పశువైద్య సిబ్బందిని నియమించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శంకర్, జిల్లా పశువైద్యాధికారి, ఫోన్: 8520939904

ఆర్‌ఎస్ నంద సందడి



దోస్త్‌నగర్ గ్రామ సమీపంలోని 'ఐ లవ్ కవ్వాల్ టైగర్ రిజర్వ్' లోగోను శుక్రవారం ప్రముఖ లఘుచిత్ర హాస్యనటుడు ఆర్‌ఎస్ నంద సందర్శించారు. లోగో వద్ద నంద ఫొటోలు తీయించుకున్నారు. అతడితో పలువురు పర్యాటకులు ఫొటోలు దిగి ముచ్చటించారు. కాగా, లఘు చిత్రం చిత్రీకరణకు సంబంధించి ఈ ప్రాంతంలో లొకేషన్లు చూసేందుకు ఆర్‌ఎస్ నంద ఇక్కడకు వచ్చినట్లు తెలిసింది.

-కడెం

దొంగలొస్తున్నారు.. జాగ్రత్త !



మధురనగర్‌లో గస్తీ కాస్తున్న కాలనీవాసులు (ఫైల్)

- పండుగలకు సొంత ఊళ్లకు ప్రజలు
- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు
- అనుమానితులుంటే సమాచారం ఇవ్వాలని సూచన



బాదన్‌కుర్తి సమీపంలో బైక్‌పై తిరుగుతున్న అనుమానితులు

ఖానాపూర్: సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఎంతో మంది వారి సొంత ఇళ్లకు వెళ్తున్నారు. పట్టణంలోని వ్యాపార కూడళ్లు, బస్టాండ్‌లు జనంతో కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా.. తిరిగొచ్చేసరికి ఇళ్లు గుల్లకాక తప్పదు. పండుగ వేళ తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు దొంగతనానికి పాల్పడే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఇటీవల పలు చోరీలు..

తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా కొద్దినెలల కిందట పట్టణంలో చోరీలు జరిగాయి. ప్రస్తుతం చలి కారణంగా జనం ఇళ్ల నుంచి బయటకు వెళ్లడం లేదు. ఇదే అదనుగా దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉంది. గతంలో పట్టణంలోని పలు ఇళ్లల్లో వరుస చోరీలకు పాల్పడ్డ దొంగల జాడ నేటికి తెలియలేదు. దీంతో అప్రమత్తమైన మధురనగర్ కాలనీవాసులు కమిటీలుగా ఏర్పడి కర్రలతో రాత్రిపూట గస్తీలు సైతం కాశారు. అయినప్పటికీ ఇతర కాలనీల్లో పలు చోరీలు జరిగాయి.

సమీపంలో దొంగల రెక్కీ..

ఖానాపూర్ మండలానికి కూతవేటు దూరంలో ఉన్న జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో చోరీ ఘటన కలకలం మారింది. మండలంలోని మొగిలిపేట్ గ్రామంలో చైన్‌స్నాచింగ్ దొంగలు వచ్చారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖానాపూర్ పోలీసులు శుక్రవారం సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. అనుమానితులైన దొంగలు బైక్‌పై తిరిగిన వీడియో దృశ్యాలను గ్రూప్‌ల్లో షేర్ చేశారు. ఈ క్రమంలో ఎవరైనా అనుమానితులు పట్టణంలో లేదా గ్రామాల్లో తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు..

- సొంతూళ్లకు వెళ్లే వారు ఇంట్లోని బంగారం, వెండి ఆభరణాలు, డబ్బును బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి. ఇళ్లు విడిచి వెళ్తున్న విషయం పోలీసులకు సమాచారమివ్వాలి.
- కొందరు పగలంతా సామగ్రి విక్రయిస్తునట్లు నటించి తాళం వేసిన ఇళ్లను చూసి రాత్రి చోరీకి పాల్పడుతారు. అనుమానితులు సంచరిస్తే 100కు సమాచారం ఇవ్వాలి.
- ఇంట్లో చిన్నారులు, వృద్ధులు ఉంటే రాత్రి వేళ ఎవరూ తలుపుకొట్టినా తీయవద్దని చెప్పాలి. ఇంటి తలుపు ముట్టుకోగానే సౌండ్ వచ్చేలా అలారం, సెంట్రల్‌లాక్ సిస్టం అమర్చుకోవాలి.
- ఇంటి పక్కవారికి ఊరెళ్తున్న విషయం తెలియజేయాలి. ఇంటి ముందు చెత్తాచెదారం, దినపత్రికలు, పాలప్యాకెట్లు జమకానివ్వవద్దు. ప్రధాన ద్వారానికి వేసినా, తాళం కనిపించకుండా పరదాలు అడ్డుగా ఉంచాలి. ఇంటిలోపల, బయట కొన్ని లైట్లు వేసి ఉంచడం మేలు.

పెట్రోలింగ్ పెంచుతున్నాం



జగిత్యాల వైపు నుంచి దొంగలు వస్తున్నట్లు సమాచారం మేరకు సిబ్బందిని, అప్రమత్తం చేశాం. సర్కిల్ పరిధిలోని ఖానాపూర్‌తో పాటు మండల కేంద్రాల్లో పెట్రోలింగ్ గస్తీల సంఖ్య పెంచాం. పోలీస్‌స్టేషన్‌లతో పాటు ఆయా చోట్ల సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేస్తున్నాం. ప్రజలెవరూ ఆందోళన చెందవద్దు. పరిసరాల్లో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

- అజయ్‌బాబు, సీఐ, ఖానాపూర్

క్రీడా పోటీలు ప్రారంభం

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో నక్కల వంశీరెడ్డి స్మారకార్థం క్రికెట్ పోటీలను శుక్రవారం నిర్వాహకులు, వంశీరెడ్డి తండ్రి ముత్యంరెడ్డి ప్రారంభించారు.రాంకుమార్, సాయారెడ్డి, క్రీడాకారులు ఉన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను కుంటాల ఎస్సై సుమాంజలి ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన జట్లకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందిస్తామని నిర్వాహకులు లస్మన్న, శ్రీనివాస్ తెలిపారు.

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో స్వామివివేకానందుడి జయంతి పురస్కరించుకొని శుక్రవారం వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. టోర్నీలో మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయని యువకులు తెలిపారు. వాలీబాల్‌లో ప్రథమ బహుమతి రూ.5వేలు, కబడ్డీలో ప్రథమ బహుమతి రూ.5 వేలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కైలాస్, శివ, నాగేశ్‌రెడ్డి, సాయినాథ్, ధనుశ్, సాయినాథ్ ఉన్నారు.

లోకేశ్వరం: కుంటాల మండలం అందకూర్ గ్రామంలో శుక్రవారం క్రికెట్ పోటీలను సర్పంచ్ దాసరి కిషన్ ప్రారంభించారు. టోర్నీలో 14 జట్లు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. ఎంపీటీసీ మధు, ఉపసర్పంచ్ వినోద్, గణేశ్, ప్రశాంత్, శ్రీధర్, సాయినాథ్ ఉన్నారు.

సారంగాపూర్: మండలంలోని బండరేవుతండాలో జరుగుతున్న నానూ మహారాజ్ జాతరను శుక్రవారం బీజేపీ నాయకులు, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ సందర్శించారు. ఈసందర్భంగా నానూమహారాజ్, జగదాంబదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు విలాస్, తదితరులు ఉన్నారు.



తిమ్మాపూర్‌లో పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై సుమాంజలి